క్లుప్తంగా

పెద్దాసుపత్రి ఏడీగా మల్లేశ్వరమ్మ


మల్లేశ్వరమ్మ

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా వై.మల్లేశ్వరమ్మ నియమితులయ్యారు. మంగళవారం ఆమె ఆసుపత్రిలో ఇన్‌చార్జ్ ఏడీ శ్రీనివాసులు నుంచి బాధ్యతలు స్వీకరించారు. 1984లో ఇదే ఆసుపత్రిలో టైపిస్టుగా ఉద్యోగంలో చేరిన ఆమె వైద్య ఆరోగ్య శాఖలో 30 ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేసి చివరగా ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాలలో ఏఓగా విధులు నిర్వహించారు. ఇటీవల పదోన్నతి పొందారు. ఆమెను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


ఏపీ ఎన్‌జీఓస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు (అర్బన్): ఏపీ ఎన్‌జీఓస్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ మంగళవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కలెక్టరేట్‌లోని కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బెస్ట్ ఎలక్టోరల్ ఆఫీసర్ అవార్డు అందుకున్న కలెక్టర్‌కు అభినందనలు తెలియజేశారు. ఇన్‌చార్జి జిల్లా కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, కర్నూలు నగర అధ్యక్షుడు ఎం.సి.కాశన్న, నగర కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జ్ఞానం పెంచుకోవాలి


మాట్లాడుతున్న కమలానంద భారతి

కర్నూలు న్యూసిటీ: విద్య కేవలం ఉపాధి కోసం కాకుండా సమాజ హితానికి ఉపయోగపడేలా జ్ఞాన సముపార్జన చేయాలని గన్నవరం భువనేశ్వరి పీఠం పీఠాధిపతులు కమలానంద భారతి స్వామీజీ అన్నారు. మంగళవారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇండస్–మాంటిస్సోరీ పాఠశాలల క్రీడాప్రాంగణంలో దాదాపు మూడు వేల విద్యార్థులతో సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కరెస్పాండెంట్ కె.ఎస్.వి.రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను యాప్‌లో నమోదు చేయాలి


మాట్లాడుతున్న మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

కల్లూరు: ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు నాల్గో నెల నుంచి ప్రసవానంతరం బిడ్డకు ఏడాది వచ్చే వరకు మాతాశిశు ఆరోగ్య సంరక్షణ, కిల్కారి మేసేజ్‌ల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఐరన్ మాత్రల పంపిణీ, విటమిన్ ఏ ద్రావణం పంపిణీ, నవజాత శిశు సేవల వివరాలను క్రమం తప్పకుండా సంబంధిత యాప్‌లలో నమోదు చేయాలని సూచించారు. చిన్న వయస్సులో గర్భదారణ వల్ల అనర్థాలు, లింగ వివక్షత నిర్మూలన, ఆడ పిల్లల ప్రాముఖ్యత, తాత్కాలిక గర్భనిరోధక పద్ధతుల గురించి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు వివరించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి మోతీలాల్ నాయక్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎస్‌ఈటీఐ భవనం ప్రారంభం

కర్నూలు(అర్బన్): నగర శివారుల్లోని బీ.తాండ్రపాడు డీఆర్‌డీఏ– టీటీడీసీ భవనం పక్కన రూ.2.5 కోట్లతో నిర్మించిన కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) నూతన భవనం బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుందని సంస్థ డైరెక్టర్ కే.పుష్పక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భవనాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జనరల్ మేనేజర్, తిరుపతి సర్కిల్ హెడ్ ఐ.పాండురంగ మితన్ ప్రారంభిస్తారన్నారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్, కర్నూలు రీజినల్ హెడ్ సుశాంత్ కుమార్ సమక్షంలో ఈ కార్యక్రమం కొనసాగనుందని ఆయన తెలిపారు.

భానుడికి ప్రణమిల్లిన భక్తజనం

- భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు
- సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సూర్యభగవానుడి మూల విరాట్‌కు హారతి పడుతున్న అర్చకుడు, సూర్యుడికి ప్రీతికరమైన గోధుమల ముడిని తీసుకొస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో మంగళవారం రథసప్తమి వేడకలు వైభవంగా జరిగాయి. అభిషేకాలు, అరుణ హోమాలు, సూర్య నమస్కారాలు నిర్వహించారు. నగర శివారులోని గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో సూర్యనారాయణ స్వామి ఆలయం 6వ వార్షికోత్సవంతో పాటు రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి సూర్యనారాయణ స్వామి మూల విరాట్టుకు క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్య జలాభిషేకం, అరుణ పారాయణం నిర్వహించారు. అరుణ హోమం, సూర్య పంచాతన హోమం, సూర్య నమస్కార కార్యక్రమాలు జరిగాయి. డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం (స్త్రీ కంఠ గాయకులు) చే నిర్వహించిన భక్తి గానలహరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గబ్బిటి కబర్ది, జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ న్యాయమూర్తి బి.లీలా వెంకటశేషాద్రి వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు టీఎస్ రామకృష్ణ, డాక్టర్ నగేష్, డాక్టర్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

– దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం ప్రాంగణంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి మూల విరాట్టుకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు యాదవేణి రామసుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.


అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు


పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఆదిత్యుడే ఆరోగ్య ప్రదాత

కర్నూలు కల్చరల్: రథసప్తమి పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు ఆధ్వర్యంలో మంగళవారం బి.తాండ్రపాడు క్రైడో పాఠశాల ప్రాంగణంలో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, కరస్పాండెంట్ శ్రావ్య కార్తిక్ మాట్లాడుతూ.. యోగాసనాల సాధనతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సూర్యోపాసనతో సర్వశక్తిమంతులమవుతామన్నారు. ప్రతిరోజు సూర్యోపాసన, సూర్య నమస్కారాలతో విద్యార్థుల్లో తేజస్సు, ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు మానసిక శారీరక రుగ్మతల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. యోగా మాస్టర్ నాగరాజు వివిధ రకాల యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు.

- సత్యసాయి మందిరంలో రథ సప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదిత్య హృదయం పఠనం చేసి ప్రత్యక్ష దైవం సూర్య భగవానునికి పూజలు చేశారు. యోగా కేంద్రం సభ్యులు సూర్య నమస్కారాలు, యోగాసానాలు, ప్రాణాయామం చేశారు.


యోగాసనాలు చేస్తున్న సత్యసాయి మందిరం సభ్యులు


యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

ఈఓఆర్‌డీపై చర్యలు తీసుకోండి

కర్నూలు(అర్బన్): దేవనకొండ మండలం కరిడికొండ పంచాయతీ కార్యదర్శి రిబ్కాను మానసిక వేధింపులకు గురిచేస్తున్న సూర్యనారాయణపై చర్యలు తీసుకోవాలని ఆమె భర్త కరుణాకర్ కోరారు. మంగళవారం ఆయన జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌ను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్య రిబ్కాపై లేనిపోని నిందలు వేస్తూ విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని మెమోలు ఇస్తూ తీవ్ర మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. మహిళా పంచాయతీ కార్యదర్శి అని చూడకుండా అవమానాలకు గురిచేస్తున్న ఈఓఆర్‌డీపై చర్యలు తీసుకోవాలన్నారు. డీపీఓ భాస్కర్ మాట్లాడుతూ.. కర్నూలు డీఎల్‌పీఓ టి.లక్ష్మిని విచారణ అధికారిగా నియమిస్తున్నామని, ఆమె విచారణ చేసి నివేదికను సమర్పించిన అనంతరం తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహర్షి టైమ్స్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ భవానీప్రసాద్

కర్నూలు (టౌన్): వీబీఎస్ఎస్, మహర్షి టైమ్స్ క్యాలెండర్‌ను మంగళవారం కర్నూలు వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ జి.భవానీ ప్రసాద్ గాయత్రీ ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కలిసి వినతిపత్రా లు అందజేయనున్నట్లు తెలిపారు.వీబీఎస్ఎస్ వ్యవస్థాపకులు కుబేర స్వామి, టి.మద్దిలేటి, నాగేశ్వరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల లక్ష్యాలను పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా


సమావేశంలో పాల్గొన్న అధికారులు

కర్నూలు న్యూసిటీ: వంద రోజుల లక్ష్యాలలో ప్రజలకు మేలు జరిగేలా వినూత్నంగా ఆలోచించాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా సూచించారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మూడవ విడత వంద రోజుల లక్ష్యాల పురోగతిపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు విడతల వంద రోజుల లక్ష్యాల పురోగతి సాధించిన అధికారులను అభినందించారు. అదే స్ఫూర్తితో మూడవ విడత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ అభివృద్ధి కార్యక్రమాలకు నాబార్డు, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. మత్స్యశాఖకు సంబంధించిన లబ్దిదారులకు 3 వీలర్స్, డొమెస్టిక్ మార్కెటింగ్ యూనిట్ల మంజూరుపై దృష్టి సారించాలన్నారు. నాబార్డు నిధులతో చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ, ఫ్యాక్టరీల ద్వారా ఉపాధి పొందిన వివరాలను సేకరించి ఇవ్వాలని ఎంప్లాయిమెంట్ అధికారిని ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు మూడు నెలల్లో అన్ని పాఠశాలలను తనిఖీ చేసి విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ అధికారులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు కలిసి ఒకే గ్రామీణ బ్యాంకుగా ఏర్పడుతున్నందున కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అక్కడే కొనసాగించాలని సేవా పబ్లిక్ సెక్టార్ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కమిటీ నాయకులు గౌతమ్, ఈ హన్మంత రెడ్డి, పీ.సురేష్, ఏ.చంద్రశేఖర్‌రెడ్డి, ఎంసీవీ రమణా రెడ్డి తదితరులు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిగిలిన గ్రామీణ బ్యాంకులతో పోలిస్తే కడపలోని ఏపీజీబీ అతి పెద్దదని, ప్రభుత్వం కేటాయించిన స్థలంలో సొంత భవనం కలిగి ఉందన్నారు. ఏ గ్రామీణ బ్యాంకుకు లేనివిధంగా కరెన్సీ చెస్ట్ సౌకర్యం కలిగి ఉందని వివరించారు. ఈ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడప నుంచి అమరావతికి తరలిపోతుందన్న ఆందోళన ప్రజల్లో ఉందన్నారు. అత్యంత కరువు ప్రాంతాల్లో సేవలందిస్తూ వ్యాపారులు, వెనుకబడిన వర్గాలకు రుణాలు ఇవ్వడంలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఇలాంటి బ్యాంకును తరలించడం వల్ల ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న కమిటీ నాయకులు

రోడ్డు ప్రమాద బాధితులను కాపాడాలి

కర్నూలు: రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడటం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని మోటర్ వాహన తనిఖీ అధికారి (ఎంవీఐ) సుధాకర్‌రెడ్డి అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని 19వ రోజు కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ఎంవీఐ సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు ఘటనా స్థలంలో ఉన్న వారెవరైనా సాయం చేయవచ్చన్నారు. తక్షణ కర్తవ్యంగా అంబులెన్స్‌కు ఫోన్ చేసి హాస్పిటల్‌కు తరలించాలన్నారు. నూతన చట్టాల ప్రకారం సాయం చేసిన వారిని ఎవరూ ఇబ్బంది పెట్టలేరన్నారు. రాష్ట్రంలో రహదారి ప్రమాదాల వల్ల గంటకు ఒకరు చొప్పున బలవుతున్నారని చెప్పారు. ప్రమాదం జరిగిన 60 నిమిషాల్లోపు ఆస్పత్రికి తరలిస్తే మరణాలు తగ్గించవచ్చన్నారు. ఎంవీఐ రవీంద్రకుమార్, ఏఎంవీఐలు బాబుకిషోర్, గణేష్ బాబు, డాక్టర్లు సునీల్‌యాదవ్, జీషాన్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంవీఐ సుధాకర్‌రెడ్డి

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ సి.వాసురెడ్డి

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ సి.వాసురెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వినూషారెడ్డి చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినం పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రతి ఏటా 15 లక్షల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేసే అవకాశం ఉందన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ సహకారంతో బాల సాయి కంటి ఆసుపత్రి ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ ఎస్.జె.జానకిరామ్ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. గుండె వైద్య నిపుణురాలు డాక్టర్ కె.అరుణ, క్లబ్ మాజీ క్యాబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్, కిమ్స్ డీజీఎం కె.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ కళ్యాణి

గోనెగండ్ల: రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ట్రైనీ కలెక్టర్ కళ్యాణి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రీ సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మండల కేంద్రంలో జరుగుతున్న రీ సర్వేను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్, వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రీ సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేసి నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. సర్వేలో తప్పులు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమార స్వామి, రీ సర్వే డీటీ శిరీష, మండల సర్వేయర్ అబ్దుల్ హమీద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

9న యోగా ప్రీమియర్ లీగ్

కర్నూలు (టౌన్): నగర శివారులోని వేదన్షి పాఠశాల ప్రాంగణంలో ఈనెల 9వ తేదీన 1వ రాష్ట్ర స్థాయి యోగా ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి పదేళ్లలోపు వారు మొదటి కేటగిరీ, 10 – 12 ఏళ్ల వారు రెండవ కేటగిరీ, 12 – 14 ఏళ్ల వారు మూడవ కేటగిరీ, 14 – 16 ఏళ్ల వారు నాలుగవ కేటగిరీ, 16 – 19 ఏళ్ల వారు ఐదో క్యాటగిరీ, 19 – 29 ఏళ్ల వారు ఆరో కేటగిరీ అలాగే 45 సంవత్సరాల పైబడిన వారిని మరో కేటగిరీగా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 93913 47212 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

కర్నూలు (హాస్పిటల్): నగర శివారులోని అభయగిరిలో ఉంటున్న లెప్రసీ, హెచ్‌ఐవీ బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ వారు నిత్యావసర సరుకులను విరాళంగా అందజేశారు. క్లబ్ సభ్యుడు పీవీ రాజ్‌కుమార్ మాతృమూర్తి సంస్మరణను పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్లబ్ ప్రెసిడెంట్ శ్రీధర్, సెక్రటరీ రహంతుల్లా, జోన్ చైర్మన్ దామెర ప్రభాకర్, సభ్యులు డాక్టర్ బాల మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి వైద్య చికిత్స అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ముఖ్యంగా క్యాజువాలిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్‌ఓడీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని ఎన్‌టీఆర్ వైద్యసేవకు సంబంధించిన కొత్త లక్ష్యాలను మరింతగా పెంచి అమలు చేయాలన్నారు. ఈ–హాస్పిటల్ అమలులో పురోగతి సాధించాలని, ఇందులో ప్లాస్టిక్ సర్జరీ విభాగం మంచి ప్రతిభ కనబరిచిందని ప్రశంసించారు. త్వరలో ఆసుపత్రిలో మరో రెండు అదనపు ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో రక్త పరీక్షలకు సంబంధించి అన్ని కిట్లు ఉన్నాయని, అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యపరీక్షల విభాగానికి సంబంధించి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించినట్లు చెప్పారు. ఆసుపత్రి పర్యవేక్షకుల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో సగటున ప్రతిరోజూ ల్యాబ్‌కు 1700 నుంచి 2 వేల శాంపిల్స్, 6 వేల నుంచి 7వేల పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, సీఎస్ఆర్ ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఏడీ మల్లేశ్వరమ్మ, హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

దురలవాట్లతో క్యాన్సర్ ముప్పు


క్యాన్సర్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ, వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): ధూమపానం, మద్యపానం, పొగాకు ఉత్పత్తులతో పాటు జన్యుపరంగా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ అన్నారు. ఆమె మంగళవారం గడ్డ యూపీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మహిళలు రొమ్ము, గర్భాశయపు క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరచుకోవాలని సూచించారు. ఎన్‌సీడీ 3.0లో భాగంగా 18 ఏళ్లు దాటిన వారందరికీ రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చేయాలన్నారు. అతిగా బరువు తగ్గడం, జ్వరం, అలసట, శరీరంలో మార్పులు, అసాధారణ రక్తస్రావం, మలమూత్ర విసర్జనలో మార్పులు, మానని పుండ్లు, రుతుక్రమంలో మార్పులు, రొమ్ములో గడ్డలు, జీర్ణ సంబంధమైన సమస్యలు, మింగడంలో ఇబ్బంది, పుట్టు మచ్చలలో మార్పులు, బొంగురు గొంతు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యాధికారికి తెలపాలన్నారు. ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. మాతా శిశు సంరక్షణ కోసం, ఆరోగ్య సూచనలు, సలహాలను ఫోన్ ద్వారా అందించేందుకు ప్రభుత్వం కిల్కారి సేవలను ప్రవేశపెట్టిందని తెలిపారు. గర్భిణిలు, బాలింతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్‌లను ఆవిష్కరించారు. డీపీఎంఓ డాక్టర్ ఉమ, ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ కైలేష్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ సాత్విక, కార్పొరేటర్ షేక్ నీలోఫర్, తదితరులు పాల్గొన్నారు.

సరుకులపై అ'ధన'పు వాత

- ఆర్‌యూలో నిత్యావసర సరుకుల ధరలకు రెక్కలు
- మార్కెట్ ధరల కంటే అదనం
- ఇవ్వని సరుకులకు ఇచ్చినట్లు లెక్కలు
- అదనపు రేట్లతో విద్యార్థుల మెస్ బిల్లుపై అదనపు భారం


రాయలసీమ యూనివర్సిటీ

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో చిత్ర విచిత్ర పరిస్థితులు చోటు చేసుకుంటూనే ఉంటాయి. అయిన వారికి అదలం ఎక్కించడంలో వారికి వారే సాటి. తాజాగా వర్సిటీ హాస్టళ్లకు సరఫరా చేసే నిత్యావసర వస్తువుల టెండర్లలో ఇది రుజువైంది. వివరాల్లోకి వెళితే.. వర్సిటీ హాస్టళ్లకు నిత్యావసర వస్తువులు సరఫరా చేసేందుకు ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను ఆహ్వానించారు. ముగ్గురు టెండర్లు వేశారు. అందులో ఒకరు డిస్‌క్వాలిఫై అయ్యారు. మిగిలిన ఇద్దరిలో ఎల్–1కు టెండర్ ఓకే చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. టెండర్‌దారులు సరఫరా చేసిన వస్తువుల ధరలకు మాత్రం రెక్కలొచ్చాయి. అగ్రిమెంట్‌లో ఏ బ్రాండ్, ఏ ధరకు సరఫరా చేయాలనే వివరాలు ఉంటాయి. ఇంతవరకు బ్రాండ్, రేట్ల వివరాలు ఉన్న ప్రొసీడింగ్స్ హాస్టళ్లకు పంపలేదు. టెండర్ దక్కించుకున్న వారు మాత్రం నిత్యావసర సరుకులను హాస్టళ్లకు పంపారు. వస్తువులను చెక్ చేసుకునే డిప్యూటీ వార్డెన్స్, హాస్టల్ సిబ్బందికి అర్థం కాని విధంగా మారింది. టెండర్‌లో ఏ బ్రాండ్ ఉందో, ఏ బ్రాండ్ సరఫరా చేశారోననే గందరగోళం నెలకొంది. సరఫరా దారులను అడిగితే వాటితో «మీకు సంబంధం లేదు మేము పంపిన వాటినే మీరు తీసుకోండి» అని దబాయిస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. తీసుకురాని సరుకులను తీసుకొచ్చినట్లు బిల్లులు సైతం ఇచ్చారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో సన్ ఫ్లవర్ ఆయిల్ లీటర్ 145 ఉంటే సప్లయ్ చేసిన బిల్లులో రూ.176 ఉంది. ఇలా 50 శాతానికి పైగా వస్తువులకు మార్కెట్ ధర కంటే రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా బిల్లు వేశారు. ఇది తమకు పెను భారంగా మారుతుందని విద్యార్థులు వాపోతున్నారు. ప్రముఖ మాల్స్‌లోని ధరల కంటే చాలా ఎక్కువగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. టెండర్ దక్కించుకున్న వారు వర్సిటీ అధికారులకు అనుకూలమైన వారు కాబట్టే రేట్ల గురించి చర్చించడం గానీ, తగ్గించడం గానీ చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిశీలించి సరిచేస్తాం

టెండర్ నిర్ణయించి అగ్రిమెంట్ చేసుకునే సమయానికి కొన్ని రేట్లు అటుఇటుగా ఉన్నాయి. కొన్ని వస్తువుల ధరలు పెరిగాయి. కొన్ని తగ్గాయి. నిత్యవసర సరుకుల ధరలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఇప్పుడు సరఫరా చేసిన వస్తువుల రేట్ల ప్రకారం మెస్ బిల్లులు వచ్చినా విద్యార్థులకు కనీసం రోజుకు రూ.2 వరకు తగ్గుతుంది. అయినా మార్కెట్‌లో ఉన్న రేట్లను తెప్పించుకొని పరిశీలిస్తాం. పూర్తి అధికంగా ఉంటే భవిష్యత్తులో రేట్లు పెరిగే శాతాన్ని బేరీజు వేసుకొని సరిచేస్తాం. నిబంధనల ప్రకారమే టెండర్లు ఫైనలైజ్ చేశాం. విద్యార్థులకు బెనిఫిట్ జరిగేలా నిర్ణయాలు తీసుకుంటాం.

– డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, ఆర్‌యూ